సేవా నిలయాలు.. సచివాలయాలు

- మహాత్ముడి గ్రామ స్వరాజ్యం కలను సాకారం చేసిన రాష్ట్రప్రభుత్వం
- ప్రజలకు అన్ని రకాల ప్రభుత్వ సేవలు గ్రామాల్లో అందిస్తున్న వైనం
- పేదరిక నిర్మూలనకు అధిక ప్రాధాన్యం
- సంతృప్తి వ్యక్తం చేస్తున్న గ్రామీణ జనం

గ్రామీణాభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాహసోపేతమైన, వినూత్న చర్యలు చేపడుతోంది. గ్రామ సచివాలయాల ద్వారా పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేస్తూనే ప్రభుత్వ సేవలను క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు చేయడం అనేది ఒక సంచలనాత్మకమైన ప్రక్రియ అనే చెప్పవచ్చు. మొత్తంగా రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలు ప్రభుత్వ సేవలు వారి చెంతనే అందుతుండడంతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.


నగరి పట్టణంలోని కశింమిట్ట సచివాలయంలో ఆధార్ అప్‌డేషన్ సేవల కోసం విచ్చేసిన ప్రజలు

నగరి/పాలసముద్రం: మొన్న రైతు భరోసా కేంద్రాలు, నిన్న గ్రామ సచివాలయాలు..ఇటీవలే ఫ్యామిలీ డాక్టర్.. నేడు జగనన్న సురక్ష ఇలా చేపట్టే ఏ కార్యక్రమం అయినా ప్రజలకు పూర్తిస్థాయిలో ఉపయోగపడాలన్నదే ప్రభుత్వ ఆశయం. అవసరం ఏదైనా ఆగమేఘాల మీద స్పందించడం ప్రభుత్వ బాధ్యత అని చెబుతూనే ఆ దిశగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు కావాల్సిన ప్రతి అంశంలో ప్రత్యేక చొరవ తీసుకుని సేవలు అందేలా పర్యవేక్షిస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలోని మారుమూల పల్లెల్లో సైతం ప్రభుత్వం సేవలు అందుతున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక పల్లెల అభ్యున్నతికి కృషి చేయడంలో ముందంజలో ఉంది. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా నూతన ఒరవడికి నాంది పలికింది. దీంతో ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన సాధ్యమైంది.

ప్రజల చేంతకే పాలన..

పల్లెల్లో సచివాలయాల ఏర్పాటుతో ప్రజల చెంతకే ప్రభుత్వ పాలన వచ్చి చేరింది. గ్రామీణ ప్రాంతాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల్లో ప్రజలకు విస్తృతమైన సేవలు అందుతున్నాయి. గ్రామీణ ప్రజలు కూడా ఇది మా ఊరి కార్యాలయం అంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ప్రజల చెంతకే పాలన అందిస్తూ రాష్ట్ర ప్రజల మన్ననలు పొందుతున్నారు. భవన నిర్మాణాలకు వేల కోట్లు ఖర్చు చేస్తున్నారు. మండలంలో 13 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం తొమ్మిది సచివాలయాలు, 9 రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. సచివాలయ భవనాలకు ఒక్కోదానికి రూ.40 లక్షలు, ఆర్‌బీకే భవనాల నిర్మాణానికి రూ.21.8 లక్షలతో ఏర్పాటు చేశారు. మండలంలోని ప్రతి పంచాయతీలో కూడా ప్రజలకు సచివాలయాల్లో ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉన్నాయి.



పాలసముద్రం సచివాలయ భవనం

అన్ని రకాల సేవలు..


సచివాలయాల ద్వారా వ్యవసాయం, విద్య, వైద్యం, అన్ని రకాల ప్రభుత్వపరమైన సేవలు అందిస్తుండడంతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో ప్రజలకు అన్నిరకాల ప్రభుత్వ సేవలు అందుతుండడం హర్షణీయం. భవిష్యత్‌లో సచివాలయ వ్యవస్థ ద్వారా మరిన్ని రకాల సేవలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ప్రజల చెంతకే పాలన తెచ్చిన సీఎం వైఎస్ జగనన్నకు మనమంతా రుణపడి ఉన్నాం. –ఎస్.శ్యామల, ఎంపీపీ

నిర్మాణాలు వేగంగా పూర్తి చేస్తాం..


సచివాలయ, రైతు భరోసా కేంద్రాలు నిర్మాణాలు నాణ్యతగా వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. అధికారుల పర్యవేక్షణలో గ్రామాల్లో ఇప్పటికే నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కొన్ని భవనాలు పూర్తయిపోయినది. బల్క్ మిల్క్ సెంటర్ల భవనాలు ఇంకా మొదలు కాలేదు.
–ప్రేమ్‌రాజ్‌కుమార్, ఎంపీడీఓ, పాలసముద్రం

మా ఊర్లోనే సేవలు..


గతంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరిగేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. మనం గ్రామంలోనే సచివాలయం, రైతు భరోసా కేంద్రం అందుబాటులో ఉన్నాయి. సచివాలయాల్లో అన్ని రకాల ప్రభుత్వ సేవలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. దీంతో రైతులు, ప్రజలనుంచి ఆనందం వ్యక్తం అవుతోంది.
–అనురేఖ, సర్పంచ్, ఆముదాల

సేవలు సూపర్..


ప్రజలకు సచివాలయ, రైతు భరోసా కేంద్రాల్లో ప్రభుత్వ పరమైన అన్నిరకాల సేవలు అందిస్తుండడంతో గ్రామీణ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో మండలకేంద్రాలకు పరుగులు తీసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. సచివాలయంలో 10 నిమిషాల్లో ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. నిజంగా సీఎం జగనన్నకు థ్యాంక్స్..
–లిల్లీ, సర్పంచ్, వెంగళరాజుకుప్పం

క్లుప్తంగా

నూతన కార్యవర్గం


నూతన సంఘ నాయకులు

పుత్తూరు రూరల్: పుత్తూరు తాలూకా శ్రీకృష్ణ యాదవ ఉద్యోగుల సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో సంఘ అధ్యక్షుడిగా సి.మునికృష్ణయ్య, కార్యదర్శిగా బి.లక్ష్మీపతి, గౌరవ అధ్యక్షుడిగా బి.రవీంద్ర, ఉపాధ్యక్షులుగా నాగరాజు, భీమారావు, గుర్రప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే కోశాధికారిగా సి.సోమశేఖర్, సహాధ్యక్షులుగా వి.వెంకటరమణయ్య, జి.జయచంద్ర, సంయుక్త కార్యదర్శులుగా పలువురిని ఎన్నుకున్నారు.

వెంకటతేజ కుటుంబానికి పరామర్శ



మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న రాంప్రసాద్‌రెడ్డి

విజయపురం (నగరి): మండలంలోని జంబాడ ఆదిఆంధ్రవాడకు చెందిన వెంకటతేజ ఆదివారం చనిపోయారు. విషయం తెలిసి మంత్రి ఆర్‌కే రోజా సోదరుడు రాంప్రసాద్‌రెడ్డి గ్రామానికి చేరుకుని వెంకటతేజ మృతదేహానికి నివాళులు అర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందించారు. ప్రభుత్వం నుంచి అవసరమైన సాయం అందించి వారి కుటుంబాన్ని ఆదుకుంటామని ఆయన తెలిపారు. పార్టీ నాయకులు జంబాడ సర్పంచ్ భాస్కర్‌రాజు, నాయకులు శివరాజు, శేఖర్‌రాజు ఉన్నారు.

నిందితుల అరెస్టు

నిండ్ర: మండలంలోని కొప్పేడు గ్రామంలో శుక్రవారం భూమి విషయంలో ఇరువర్గాలకు తగాదా జరిగిన విషయం విదితమే. బాధితురాలు సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రవిశంకర్ కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం నలుగురు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారు. దీంతో వారిని చిత్తూరు జైలుకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పచ్చాలమ్మకు ప్రత్యేక పూజలు



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాల పంచాయతీ పచ్చాలమ్మ కాలనీలో వెలసిన పచ్చాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. గ్రామస్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

7న తిరుపతిలో ఓబీసీ జాతీయ మహాసభ


మాట్లాడుతున్న మార్గాని మధు ఆచారి

తిరుపతి కల్చరల్: తిరుపతిలో ఆగస్టు 7వ తేదీన ఓబీసీ జాతీయ మహాసభ నిర్వహించనున్నట్టు ఏపీ బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జయచంద్ర, ఉపాధ్యక్షుడు మార్గాని మధు ఆచారి తెలిపారు. వారు ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అధ్యక్షన జరిగే ఈ మహా సభకు దేశ వ్యాప్తంగా నలుగురు ముఖ్యమంత్రులు హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా పార్లమెంట్‌లో బీసీ బిల్లు ఆమోదంతో పాటు, ఓబీసీల ప్రధాన సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు నాగేంద్ర, సుబ్రమణ్యం, జగదీష్, వాసు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న లవకుశ నాటకం



చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరిలో వెలసిన కోదండ రామ స్వామి ఆలయం వద్ద ఆదివారం సుబ్బరాజు నాటిక కళాపరిషత్ కళాకారులు ప్రదర్శించిన లవకుశ నాటకం పలువురిని అలరించింది. అంతఃపురంలో శ్రీరామచంద్రుడు, అడవిలో సీతాదేవి పడిన కష్టాలను అద్భుతంగా అభినయించారు. వాల్మీకి మహర్షి లవకుశలకు చేసిన అక్షరాభ్యాసం, అనంతరం లక్ష్మణ, శ్రీరామచంద్రుడితో లవకుశలు యుద్ధ ఘట్టాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ రూప ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈఓ సుబ్బరాజు, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, శంకర్ రెడ్డి, చేగు లక్ష్మీనారాయణ గుప్త, రామ్మూర్తి పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన


రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

వెదురుకుప్పం: మండల పరిధిలోని పాతగుంట ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ధన్వంతరి హెల్త్ అండ్ కేర్ సొసైటీ అధ్యక్షుడు రామచంద్ర భూపతి జన్మదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామచంద్రభూపతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వైద్యశిబిరంలో సుమారు 164 మంది రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇవ్వడం జరిగిందన్నారు. 14 మందిని శస్త్ర చికిత్స కోసం రమాదేవి హాస్పిటల్స్‌కు చెందిన వాహనంలో తీసుకెళ్లినట్లు తెలిపారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి

నగరి: స్థానిక పీసీఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వెనుక వైపున ఈనెల 14వ తేదీ రామచంద్రపురం మండలం పీవీపురం ఎస్టీ కాలనీకి చెందిన రామరాజు (27) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అతన్ని గమనించిన స్థానికులు చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. అయితే ఆస్పత్రిలో అతని పరిస్థితి విషమించడంతో ఆదివారం రామరాజు మృతి చెందినట్లు సీఐ శ్రీనివాసంతి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

కాపుల సంక్షేమానికి కృషి


మాట్లాడుతున్న జీడీనెల్లూరు నియోజకవర్గ కాపు సంక్షేమ సేన అధ్యక్షుడు ప్రసాద్‌రాయల్

కార్వేటినగరం: కాపు సంక్షేమానికి అన్ని విధాలా కృషి చేస్తానని జీడీనెల్లూరు నియోజకవర్గం కాపు సంక్షేమ సేన అధ్యక్షుడు కే.ప్రసాద్ రాయల్ తెలిపారు. ఆదివారం స్థానిక ద్రౌపదీ అమ్మవారి ఆలయంలో కాపు, బలిజల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాపులను సంఘటితం చేసి, కాపుల అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. భవిష్యత్తులో బలిజలు, సమాజంలో ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా బలోపేతం అయ్యేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గం కాపు సంక్షేమ సేన అధ్యక్షుడితో పాటు ఆరు మండలాలకు అధ్యక్షులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆర్గనైజర్ రాజశేఖర్, సంక్షేమ సేన రాష్ట్ర కార్యదర్శి గోపిరాయల్, గాజుల నరసింహులు, నాగముని నాయుడు, రవి, దేవరాజులు, తులసీ రాయల్, జయశంకర్ నాయుడు, లోకనాథనాయుడు పలువురు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనం నడిపితే చర్యలు


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ దస్తగిరి

కార్వేటినగరం: మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని, అలాగే భారీ జరిమానా తప్పదని ఎస్‌ఐ దస్తగిరి తెలిపారు. ఆదివారం సాయంత్రం చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై ఇండియన్ పెట్రోల్ బంకు వద్ద నాకాబంధీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందన్నారు. అలాగే మైనర్ పిల్లలకు వాహనాలు నడిపినా, వారికి వాహనం ఇచ్చిన వారికి, తల్లిదండ్రులకు శిక్ష తప్పదని హెచ్చరించారు. అదే విధంగా డ్రైవింగ్ లైసెన్సు, వాహనాల రికార్డులు తమ వద్దే ఉంచుకోవాలని లేదంటే జరిమానా తప్పదన్నారు. ఆటో డ్రైవర్లకు యూనిఫాం తప్పనిసరిగా ఉండాలని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే ఆటో సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా వాహనాలను తనిఖీ చేసి, పలువురికి జరిమానా విధించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ మునికృష్ణ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అలరించిన కూచిపూడి నృత్యం



తిరుచానూరు(చంద్రగిరి): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో తిరుపతికి చెందిన కొండా రవి ఆధ్వర్యంలో కళాకారులు చేపట్టిన కూచిపూడి, జానపద నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. కళాకారులు శ్రీనయన, యశస్విణి, తేజోమయి, కుషల, షణ్ముఖ, శాన్వి, మేహన, సహస్ర, హస్సిక, బిబిత, శ్రీనయన పాటలకు అనుగుణంగా అభినయంతో ఆకట్టుకున్నా రు. వారిని ఏఓ ఖాదర్‌వలి సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రదోష పూజలు


స్వామివారిని ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

నగరి: స్థానిక కరకంలేశ్వర స్వామి ఆలయంలో శనివారం రాత్రి నుంచి ప్రదోష పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టిన అనంతరం కామాక్షీ సమేత కరకంలేశ్వర స్వామిని ప్రత్యేకంగా అలంకరించి నందివాహనంపై ఉంచి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణ చేశారు. అనంతరం స్వామివారిని భక్తుల దర్శనార్థం మండపం వద్ద ఉంచగా అధిక సంఖ్యలో ప్రదోష గడియల్లో దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు కావలసిన ఏర్పాట్లు చేశారు.


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ఘాట్ రోడ్‌లో అదుపు తప్పిన కారు

తిరుమల: మొదటి ఘాట్ రోడ్‌లో ఆదివారం కారు అదుపుతప్పింది. శ్రీకాకుళానికి చెందిన భక్తులు శ్రీవారి దర్శనం చేసుకుని తిరిగి ప్రయాణమయ్యారు. మొదటి ఘాట్ రోడ్ అలిపిరి సమీపంలో వాహనం అదుపుతప్పి పక్కన ఉన్న పిట్టగోడను ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీకాకుళం చెందిన పద్మకు చిన్నపాటి గాయాలయ్యాయి. ఘాట్ రోడ్ సిబ్బంది వాహనాన్ని పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

చెరుకు రైతులకు బకాయిలు చెల్లించండి


సమావేశంలో పాల్గొన్న నాయకులు

నిండ్ర: మండల కేంద్రం నిండ్రలో ఉన్న నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం చెరుకు రైతులకు చెల్లించాల్సిన రూ.37 కోట్లు బకాయిలను తక్షణం ఇవ్వాలని చెరుకు రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక షుగర్ ఫ్యాక్టరీ ఆవరణలో వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం నుంచి రైతులకు చెల్లించాల్సిన బకాయిలను ఇప్పించాలని పలుమార్లు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. అలాగే రైతులతో కలిసి ఫ్యాక్టరీ వద్ద ధర్నాలు చేసినా ఇప్పటివరకు రైతులకు బకాయిలు అందలేదని వాపోయారు. ఫ్యాక్టరీ యాజమాన్యం తక్షణం స్పందించి రైతులకు బకాయిలు చెల్లించాల్సిన లేదంటే ఆందోళనకు దిగుతామని, త్వరలో నిరాహార దీక్ష చేసేందుకు కూడా వెనుకాడమని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఆదినారాయణ రెడ్డి, శ్రీనివాస యాదవ్, ప్రకాష్ పాల్గొన్నారు.

అంకయ్య సేవలు మరువలేనివి


నివాళులు అర్పిస్తున్న ఆటో కార్మికులు

పుత్తూరు రూరల్: పుత్తూరు ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా అంకయ్య చేసిన సేవలు వరువలేనివని సమాచార హక్కుల వేదిక కార్యదర్శి కె.మురగారెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక నగరం రోడ్డులోని ఆటోస్టాండ్ వద్ద అంకయ్య వర్ధంతిని ఆటో యూనియన్ వర్కర్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మురగారెడ్డి మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారంలో అంకయ్య చూపిన చొరవ, తెగువ ప్రతి కార్మికుడికి ఆదర్శం కావాలన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు కాశింబాయ్, నాయకులు కిరణ్, దత్తాత్రేయ, మహేష్, లక్ష్మీపతి, పయణి, పెద్ద అంకయ్య, జయచంద్ర, హమీద్‌భాషా, దాము, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపండి



మాట్లాడుతున్న డాక్టర్ సుభాషిణి, వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు

పుత్తూరు రూరల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల అప్రమత్తతతో మెలగాలని డాక్టర్ సుభాషిణి సూచించారు. పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరి కనంమిట్ట వద్ద మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్య సేవలందించడానికి విచ్చేసిన డాక్టర్ సుభాషిణి మాట్లాడుతూ నేటి సమాజంలో ఆహార వస్తువులన్నీ కలుషితవుతున్న నేపథ్యంలో ఆరోగ్యం పట్ల అప్రమత్తత అవసరమని వివరించారు. వాకర్స్ అసోసియేషన్ వారు చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. వైద్య శిబిరంలో 400 మంది వైద్యం కోసం రావడం మంచి పరిణామమని అన్నారు. వైద్య శిబిరంలో అసోసియేషన్ ఫౌండర్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.శ్రీనివాసులురెడ్డి, డాక్టర్లు నాగరాజు, నగేష్, ఆర్ముగం, రవిరాజు వైద్యసేవలు అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నగరి కమిషనర్ కె.వెంకట్రామిరెడ్డి, స్టోన్ క్రషర్ నిర్వాహకులు పి.రమేష్‌యాదవ్ పాల్గొన్నారు. సంఘ నాయకులు రామచంద్రనాయుడు, మురగేశ రెడ్డి, గుణశేఖర్‌రెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

సొంత డబ్బా మానుకో పవన్

- మా వలంటీర్ల సేవలు తెలుసుకో
- పవన్ వ్యాఖ్యలపై కొనసాగుతున్న వలంటీర్ల నిరసనలు


ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళా వలంటీర్లు

పుత్తూరు రూరల్: నిత్యం ప్రజాసేవలో ఉన్న వలంటీర్లపై పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహజ్వాలలు చల్లారలేదు. ఆదివారం పుత్తూరు మండలం తిమ్మాపురం గ్రామంలో మహిళా వలంటీర్లు ఈ సందర్భంగా పవన్ డౌన్‌డౌన్, పవన్ క్షమాపణలు చెప్పాలంటూ ప్లకార్డ్స్ చేతపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలంటీర్లపై పవన్ కల్యాణ్ చేస్తున్న ఆరోపణలను దమ్ముంటే నిరూపించాలని డిమాండ్ చేశారు. అసలు తను చేపట్టిన వారాహియాత్ర, సభలు, సమావేశాలు ఎవరి కోసం నిర్వహిస్తున్నాడో సూటిగా చెప్పాలని ప్రశ్నించారు. వలంటీర్ల వ్యవస్థకు దేశవ్యాప్త గుర్తింపు వచ్చిన విషయాన్ని పవన్ గుర్తించాలన్నారు. తన రాజకీయ లబ్ధి కోసం ప్రజలకు సేవలందిస్తున్న తమ వలంటీర్లపై తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని, తక్షణం బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తగిన రీతిలో బుద్ధి చెప్తామని హెచ్చరించారు.

నిందలు వేయడం మానుకో..


మహిళల పట్ల తనకు ఎనలేని గౌరవం అని చెప్పుకునే నువ్వు మూడు పెళ్లిళ్లు ఎందుకు చేసుకోవాల్సి వచ్చింది. తొలి ఇద్దరు భార్యలకు నువ్వు చేసిన మంచి ఏమిటో ప్రజలకు వివరించు. ఆ తర్వాత ఇతర మహిళల గురించి మాట్లాడు. నీ భార్యలకు న్యాయం చేయలేని నువ్వు రాష్ట్ర ప్రజలకు ఎలా న్యాయం చేయగలవు? అందుకే గత ఎన్నికల్లో నిన్ను రెండు చోట్లా ఓడించారు. చంద్రబాబు ఇచ్చే ప్యాకేజీల కోసం వలంటీర్లపై నిందలు వేయడం మానుకోవాలి.
– బి.గీతాంజలి, వలంటీర్, కేఎం అగ్రహారం, పుత్తూరు

క్షమాపణలు చెప్పాలి..


వలంటీర్లపై నిరాధార ఆరోపణలు చేసిన పవన్ తక్షణం క్షమాపణలు చెప్పాలి. మహిళలను ట్రాప్ చేసి విదేశాలకు విక్రయిస్తారంటూ చెప్పడం అతని రాజకీయ దివాలాకోరు తనానికి నిదర్శనం. వలంటీర్లలో 70 శాతం మహిళలే ఉన్నారన్న విషయాన్ని ఆయన తెలుసుకోవాలి. నోటికి వచ్చినట్లు ఏది పడితే అది మాట్లాడితే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు. నీ మాటల వల్ల మహిళలకు నీపై ఉన్న కొద్దో గొప్పో మంచి అభిప్రాయాన్ని పోగొట్టుకొన్నావ్.
– టి.వరలక్ష్మి, వలంటీర్, పుత్తూరు

ప్రభుత్వ భూమిపై కన్నేసిన టీడీపీ నేత

- విజయపురం మండలం కేవీపురంలో ఇంటిస్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వ భూమిని గుర్తించిన అధికారులు
- ఆ భూమిని సర్వే చేయవద్దంటూ టీడీపీ నేత అడ్డగింత
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు


ఇంటి స్థలాల కోసం అధికారులు చదును చేసిన ప్రభుత్వ భూమి

విజయపురం (నగరి): ప్రభుత్వ భూములు కనిపిస్తే పచ్చనేతలు మూడో కంటికి తెలియకుండా ఆక్రమించేస్తున్నారు. తమ పొలాల పక్కన ఉన్న ప్రభుత్వ భూములను వారి భూమిలో కలిపేసుకునేందుకు వారు పన్నాగం వేస్తున్నారు. విజయపురం మండలం కేవీపురం లెక్కదాఖలా సర్వే నంబరు 183లో ఉన్న ప్రభుత్వ భూమిని అధికారులు చదును చేసి పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని నిర్ణయించారు. అయితే ఆ స్థలాన్ని సర్వే చేసేందుకు అధికారులు వెళ్లగా ఎమ్మెల్సీ శ్రీకాంత్‌కు దగ్గర బంధువైన శంకర్‌నాయుడు అడ్డుకున్నాడు. దీంతో ఆ ప్రభుత్వ భూమి అతని ఆధీనంలో ఉందన్న విషయం బయటపడింది.

ఓర్వలేకనే..

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తరువాత రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. ముఖ్యంగా ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేర్చాలన్న ఉద్దేశంతో ఇంటిస్థలం ఇవ్వడంతో పాటు ఇళ్లు కూడా కట్టిస్తున్నారు. కానీ ఇది ఓర్వలేని టీడీపీ నాయకులు ప్రతి చోట పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వకుండా అడ్డుపడడం, కోర్టులకు వెళ్లి స్టేలు తెస్తున్న విషయం విదితమే. తాజాగా విజయపురం మండలంలోని కేవీపురంలో పేదలకు ఇంటిస్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వ భూమిని అధికారులు గుర్తించి, సర్వే చేసేందుకు వెళ్తే టీడీపీ నేత అడ్డుకోవడం శోచనీయమని స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వ భూమి పేదలకు ఇవ్వడం నచ్చకే ఇలా టీడీపీ నేత అడ్డుకుంటున్నాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకుని ఆ భూమిలో తమకు ఇంటి స్థలాలు ఇప్పించాలని కోరుతున్నారు.